సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 3 । నవంబర్ । 2023



బాల్ బ్యాడ్మింటన్‌లో సత్తా..

బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారిణులు సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. 4లో



ర్యాగింగ్ నిషేధంపై పోస్టర్

విశాఖ: ఏయూలో ర్యాగింగ్ నిషేధం, చట్టాలపై అవగాహన కల్పించేలా డీన్ విజయ్‌మోహన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.



నాక్ మెచ్చేలా.. ఏయూ ముస్తాబు

విశాఖ: నాక్ కమిటీ పర్యటనకు ఏయూ ముస్తాబవుతోంది. ఈ నెల 4, 5, 6 తేదీల్లో బృందం ఏయూలో పర్యటించనుంది.

ఆతిథ్యం అదుర్స్



వేదికపై సీఎం వైఎస్ జగన్, కేంద్ర మంత్రి షెకావత్, మంత్రులు అంబటి రాంబాబు, గుడివాడ అమర్‌నాథ్, విడదల రజని, ఇతర ప్రతినిధులు

- ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సదస్సుకు వేదికైన విశాఖ
- 90 దేశాల నుంచి 1,200 మంది ప్రతినిధులు హాజరు
- కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో కలిసి సదస్సు ప్రారంభించిన సీఎం జగన్
- పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీస్ శాఖ



ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న మేయర్ హరివెంకటకుమారి

దొండపర్తి (విశాఖ): విశాఖ ఆతిథ్యం అదిరిపోయింది. విదేశీ ప్రతినిధులను మంత్రముగ్ధులను చేసింది. మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సదస్సుకు వేదికైన విశాఖ.. 90 దేశాలకు చెందిన 1200 విదేశీ ప్రముఖులకు గ్రాండ్ వెల్కమ్ చెప్పింది. 25వ ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ కాంగ్రెస్ ప్లీనరీ తొలి రోజు సమావేశం గురువారం రాడిసన్ బ్లూ హోటల్‌లో విజయవంతంగా జరిగింది. కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో కలిసి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఈ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ రాష్ట్రంలో అత్యాధునిక నీటిపారుదల విధానాలు, సాగునీటి రంగం, వ్యవసాయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. అలాగే కేంద్రం మంత్రి షెకావత్ ప్రధాని మోదీ నేతృత్వంలో నీటి సంరక్షణ, డ్యామ్‌ల పరిరక్షణ, నదుల అనుసంధానానికి చేపట్టిన ప్రణాళికలను విశదీకరించారు.

మంత్రముగ్ధులైన విదేశీ ప్రతినిధులు

ఐసీఐడీ సదస్సుకు వివిధ దేశాలకు చెందిన అంబాసిడర్లు, మంత్రులు, జలవనరుల రంగ నిపుణులు వచ్చారు. 57 ఏళ్ల తరువాత భారత్‌లో జరుగుతున్న ఈ అంతర్జాతీయ సదస్సుకు విశాఖ అతిథ్యమిచ్చింది. వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు విశాఖ అందాలను చూసి మంత్రముగ్ధులయ్యారు. రాడిసన్ బ్లూ హోటల్ వద్ద సందడి చేశారు. సదస్సులో కీలక ప్రసంగాలు, ప్రదర్శనలు అనంతరం ప్రతినిధులు బీచ్ అందాలకు ఫిదా అయిపోయారు. ఈ ప్రతినిధుల కోసం జిల్లా యంత్రాంగం చేసిన ఏర్పాట్లను చూసి వారు మురిసిపోయారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రతినిధులు బస చేసే హోటల్ నుంచి వారి రాడిసన్ బ్లూకు వచ్చే వారికి ప్రత్యేక బందోబస్తు కల్పించారు. దీంతో తొలి రోజు సదస్సు ప్రశాంతంగా ముగిసింది. ఈ నెల 8వ తేదీ వరకు ఈ సదస్సు జరగనుంది.

సీఎం జగన్‌కు ఘన స్వాగతం

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఐసీఐడీ సదస్సు కోసం గురువారం ఉదయం 8.52 గంటలకు ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. ఆయనతోపాటు విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు వచ్చారు. ఇక్కడ నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ మాధవి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ నుంచి 9.08 గంటలకు హెలికాప్టర్‌లో మధురవాడ ఐటీ హిల్–3కు బయలుదేరారు. అక్కడ హెలిప్యాడ్ వద్ద సీఎంకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పోలీస్ కమిషనర్ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ స్వాగతం పలికారు. అనంతరం అక్కడ వేచి ఉన్న వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, అదీప్ రాజ్, ఉమాశంకర్ గణేష్‌లను పేరుపేరున పలకరించారు. అనంతరం ఆయన రాడిసన్ హోటల్‌కు వెళ్లి సదస్సును ప్రారంభించారు. సదస్సుముగిసిన తరువాత సీఎం మధ్యాహ్నం 11.55కు ఐటీ హిల్–3కు చేరుకున్నారు. అక్కడ మంత్రులు కొట్టు సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, ఇతర నాయకులు, అధికారులు సీఎంకు వీడ్కోలు పలికారు. హెలికాప్టర్‌లో విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకొని 12.22 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరారు.



రాడిసన్ బ్లూ హోటల్‌లో విదేశీయుల సందడి





హాజరైన వివిధ దేశాల ప్రతినిధులు

దారులన్నీ జన గోదారులయ్యాయి... అన్ని పల్లె మార్గాలు అడుగులో అడుగు వేస్తూ మాడుగుల చేరాయి... ఒక్కొక్కరిగా...గుంపులుగా... బృందాలుగా... సమూహాలుగా చేరి.. ప్రభంజనంగా మారారు.. గతుకుల బతుకులు మార్చి... పాలన సారథులుగా అందలమెక్కించిన సాధికార ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలుగా ఘాట్ రోడ్డుకు భారీగా తరలివచ్చారు. పొలిమేర కూడా కనిపించనంతగా పోటెత్తారు...అభివృద్ధి చేసి చూపిస్తే అభిమానం ఇలాగే ఉంటుందన్నట్టుగా... అసంఖ్యాకంగా హాజరయ్యారు. సామాజిక సాధికార బస్సు యాత్రకు బ్రహ్మరథం పట్టారు. జరిగిన అభివృద్ధి, పాలనలో వచ్చిన మార్పులు.. ప్రభుత్వం, పార్టీలో అన్ని వర్గాల వారికి కేటాయించిన పదవులు, ఇతర వివరాలను మంత్రులు, అభిమాన నేతలు తెలపడంతో ఆసాంతం విన్నారు... హర్షధ్వానాలతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. వెరసి ప్రత్యర్థులు సైతం శభాష్ అన్నట్టుగా మాడుగుల నియోజకవర్గంలో బస్సు యాత్ర సాగింది...



మాడుగులలో జరిగిన సభకు భారీగా హాజరైన జనసందోహం

• ప్రతిధ్వనించిన సామాన్యుడి గుండె చప్పుడు

ప్రభంజనం



బస్సు యాత్రకు ముందు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



మాడుగుల సభలో ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, వేదికపై డిప్యూటీ సీఎం రాజన్నదొర, మంత్రులు బొత్స, అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎమ్మెల్సీ కల్యాణి, ఎమ్మెల్యేలు ఉమాశంకర్ గణేష్, బాబూరావు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

- సామాజిక సాధికార బస్సు యాత్రలో వెల్లువెత్తిన అభిమానం
- జన సంద్రాలుగా మారిన మాడుగుల రహదారులు

సాక్షి, అనకాపల్లి: మాడుగుల నియోజకవర్గంలో గురువారం జరిగిన వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. వేలాది బైక్‌లు, ఆటోలు, వందలాది కార్లతో ర్యాలీగా యాత్ర సాగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 53 నెలల పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేసిన మంచిని వివరించడానికి నిర్వహించిన ఈయాత్ర జైత్రయాత్రలా జరిగింది. బస్సుయాత్ర, బహిరంగ సభల్లో వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం, మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో కె.కోటపాడులో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన బస్సు యాత్రకు ప్రజలు అడుగడుగున బ్రహ్మరథం పట్టారు. బస్సుయాత్ర ప్రారంభమైన ప్రాంతం మహిళల కోలాటాలు, జై జగన్..జై బూడి నినాదాలతో సందడిగా మారింది. ఈ యాత్ర సాగిన గ్రామాల ప్రధాన కూడళ్లలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ ఎత్తున బాణసంచా కాల్చి స్వాగతం పలికారు. మొదట కె.కోటపాడు శివాలయం వద్దకు చేరుకున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణలకు వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం బస్సు యాత్రను మంత్రి బొత్స సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. బస్సుయాత్ర కె.కోటపాడు, సింగన్నదొరపాలెం, సూర్రెడ్డిపాలెం, ఎ.కోడూరు, వారాడ, వి.సంతపాలెం, ఆనందపురం గ్రామాల మీదుగా దేవరాపల్లి మండలంలోకి ప్రవేశించింది. అంతకుముందు కె.కోటపాడులోని ఆస్పత్రిని మంత్రులు పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వీరితో మాట్లాడుతూ ఈ ఆస్పత్రి స్థాయిని 50 పడకలకు పెంచుతూ అదనపు భవన నిర్మాణాలకు, మౌలిక వసతులకు సీఎం రూ.5.60 కోట్లను మంజూరు చేసినట్టు తెలిపారు. పనులు ఈ నెలాఖరునాటికి పూర్తయ్యేలా అధికారులు చర్యలను తీసుకోవాలని మంత్రి బొత్స సత్యనారాయణ సూచించారు.

ఎ.కోడూరులో వైఎస్సార్‌కు నివాళి

ఎ.కోడూరులో గల దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎ.కోడూరు హైస్కూల్‌లో నాడు–నేడులో జరిగిన అభివృద్ధి పనుల వివరాలను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ హెచ్‌ఎం కామేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. నాడు–నేడు రెండవ దశలో మంజూరైన అదనపు భవనాలకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయనున్నట్టు మంత్రి బొత్స తెలిపారు. వీటితో పాటు మరో రెండు పాత తరగతి గదుల స్థానంలో నూతన భవనాల నిర్మాణాలకు నిధులను మంజూరు చేయనున్నట్టు చెప్పారు. అనంతరం దేవరాపల్లి మండలం మీదుగా మాడుగుల మండలానికి బస్సు యాత్ర సాగింది. మొత్తం 45కిలోమీటర్ల మేర యాత్ర జరిగింది.

చంద్రబాబుకు మూడు వేళ్లు చూపించండి

మాడుగుల ఘాట్‌రోడ్డులో జరిగిన బహిరంగ సభకు వేలాదిమంది తరలివచ్చారు. ఇసుక వేస్తే రాలనంతగా ఆ ప్రాంతం నిండిపోయింది. నేతల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. జనవరి ఒకటి నుంచి ప్రభుత్వం సామాజిక పింఛన్ రూ.3 వేలకు పెంచుతోందని, రెండు వేళ్లు చూపించే చంద్రబాబు తదితర టీడీపీ నేతలకు వృద్ధులు ఇక మూడు వేళ్లు చూపించాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చేసిన వ్యాఖ్యకు జనం నుంచి మంచి స్పందన లభించింది. పార్టీ, ప్రభుత్వ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఎన్నెన్ని పదవులు ఇచ్చారు.. ఎంత ప్రాధాన్యం కల్పించారో మంత్రులు, ముఖ్య నాయకులు వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఆ పార్టీ నాయకులు ఎలా దోచుకున్నారో వివరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పెట్ల ఉమాశంకర్‌గణేష్, నవరత్నాల అమలు కమిటీ రాష్ట్ర వైస్‌చైర్మన్ నారాయణమూర్తి, మాడుగుల నియోకజవర్గ పరిశీలకులు ఉరుకూటి అప్పారావు, జీసీసీ చైర్‌పర్సన్ శోభాస్వాతి రాణి, మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణ రాజు, విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, విశాఖ సౌత్ నియోజకవర్గం పరిశీలకుడు వీసం రామకృష్ణ, చోడవరం నియోజకవర్గం పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావ్, మాజీ ఎమ్మెల్యే అల్లు భానుమతి,నియోజవర్గం పరిశీలకుడు ఉరుకూటి అప్పారావు, విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కె.కోటపాడులో ఆస్పత్రిని సందర్శిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, బొత్స సత్యనారాయణ

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



వేదిక వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు

మాడుగుల: వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వంగపండు ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జానపద కళాకారులు పాటలు, నృత్యాలతో హోరెత్తించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు జరిగిన మంచిని వివరిస్తూ సభా వేదికపై సుమారు రెండు గంటల పాటు గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటాలు, డీజే, తీన్మార్, తప్పెటగుళ్ల వంటి కార్యక్రమాలు అలరించాయి. సభా ప్రాంగణం వద్ద ప్రజలకు తాగు నీటితో పాటు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. పోలీసు యంత్రాంగం ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు వాహనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.



సామాజిక సాధికార బస్సు యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి బొత్స



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రులు

నేటి నుంచి రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు

- 13 జిల్లాల నుంచి 470 మంది హాజరు
- నక్కపల్లిలో అండర్–17 పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



నక్కపల్లి హాకీ క్రీడా మైదానం

నక్కపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు (అండర్ –17 విభాగం) శుక్రవారం నుంచి జరగనున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు నక్కపల్లి వేదిక కానుంది. నక్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం, బోదిగల్లం రోడ్డులో ఉన్న హెటిరో హాకీ క్రీడా మైదానంలో 5వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయని మండల విద్యాశాఖాధికారి కుంచం నరేష్ తెలిపారు. పోటీల నిర్వహణకు ఏర్పాటు చేసిన కమిటీలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి 470 మంది హాకీ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. అండర్–17 బాలుర, బాలికల విభాగంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులతో 67 కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ పోటీల కోసం 39 మంది కోచ్‌లను నియమించారన్నారు. బాలికల కోసం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం, బాలుర కోసం బోదిగల్లం రోడ్డులో ఉన్న హాకీ క్రీడా మైదానాలను ఎంపిక చేశామన్నారు. శుక్రవారం ఉదయం ఈ పోటీల ప్రారంభోత్సవానికి అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, డీఈవో వెంకటలక్ష్మమ్మలు ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారన్నారు. ఈ సమావేశంలో నోడల్ హెచ్‌ఎం వేమగిరి నూకరాజు, కోడి శ్రీనివాసరావు, రాణి లలిత, నారాయణరావులతోపాటు పలువురు ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదోడి గుండెపై ‘సంక్షేమ’ సంతకం



కె.కోటపాడు: ప్రతి పేదవాడి జీవనప్రమాణాలు మెరుగుపడేలా సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజారంజక పాలనను అందించారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా కె.కోటపాడు శివాలయం కల్యాణ మండపం వద్ద గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల వారికి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నట్టు తెలిపారు. రాజకీయ పదవుల్లోనూ అధిక ప్రాధాన్యతను కల్పించారని చెప్పారు. రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. మాడుగులలో 2024లో కూడా మరోమారు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు.

1.60 కోట్ల కుటుంబాలకు లబ్ధి



కె.కోటపాడు : రాష్ట్రంలో అట్టడుగు వర్గాల వారికి కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ ప్రాధాన్యతను కల్పించినట్టు డిప్యూటీ సీఎం, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పీడిక రాజన్నదొర చెప్పారు. కె.కోటపాడులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రకటించిన నవరత్నాల పథకాలను అర్హులైన కుటుంబాలకు పారదర్శకంగా అందించిన ఘనత సీఎంకు దక్కుతుందన్నారు. నవరత్నాల పథకాల ద్వారా రాష్ట్రంలో 1.60 కోట్ల కుటుంబాలకు సంక్షేమ లబ్ధి కలిగిందని చెప్పారు. సీఎం జగన్ 99 శాతం హామీలను అమలు చేశారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో జరిగినంత మేలు గతంలో ఎన్నడూ బడుగు, బలహీనవర్గాలు, గిరిజనులకు జరగలేదని రాజన్నదొర తెలిపారు.

సాక్ష్యాధారాలతోనే చంద్రబాబుకు రిమాండ్



కె.కోటపాడు: స్కిల్‌స్కాంలో అవినీతి జరిగిందని, చంద్రబాబు పాత్ర ఉందని తగిన సాక్ష్యాలను సీఐడీ అధికారులు చూపడంతో కోర్టు ఏకీభవించి రిమాండ్ విధించిందని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. కె.కోటపాడులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందులో ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. కోర్టు ఇచ్చిన బెయిల్ సమయం పూర్తవగానే చంద్రబాబు జైలుకి వెళ్లాలని తెలిపారు. ఉప ముఖ్యమంత్రులుగా, రాజ్యసభ, ఎమ్మెల్సీ, కార్పొరేషన్, దేవాలయాల ట్రస్ట్‌బోర్డుల్లో బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు సీఎం జగన్ పదవులు కల్పించినట్టు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ వర్గాల వారికి జరిగిన మంచి, అభివృద్ధిని తెలిపేందుకు సామాజిక సాధికారిక బస్సు యాత్రను నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

డీఈవో ఎ.కోడూరు హైస్కూల్ తనిఖీ

కె.కోటపాడు: పది విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. ఎ.కోడూరు పాఠశాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పది విద్యార్థులకు నిర్వహిస్తున్న అదనపు తరగతుల వివరాలను, ఉపాధ్యాయుల బోధన ప్రణాళికను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతిలో చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. ఎంఈవోలు సత్యనారాయణ, డి.వి.డి.ప్రసాద్, హెచ్‌ఎం కామేశ్వరరావు డీఈవో వెంట ఉన్నారు.



ఎ.కోడూరు హైస్కూల్‌లో లెస్సన్ ప్లానింగ్‌ను అడిగి తెలుసుకుంటున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ

10న నక్కపల్లిలో ‘స్పందన’

తుమ్మపాల: నక్కపల్లి మండల కేంద్రంలో శుక్రవారం జరగవలసిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల సమావేశంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పాల్గొనాల్సి ఉన్నందున స్పందన తేదీని మార్పు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా

పెందుర్తిలో అనధికారిక బాణసంచా పట్టివేత



పెందుర్తిలో పట్టుబడిన బాణాసంచా

పెందుర్తి: పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి సమీపంలోని నూకాలమ్మ ఆలయం వద్ద అనధికారికంగా నిల్వ ఉంచిన బాణసంచాను పెందుర్తి పోలీసులు పట్టుకున్నారు. వివరాలివి.. పెందుర్తి కూడలి వద్ద ఓ ఆటోలో అనధికారికంగా తీసుకువచ్చిన బాణసంచాను నిల్వ చేసేందుకు సిద్ధమవుతున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రూ.2.50 లక్షల విలువైన బాణసంచాను స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఏఐ ఎక్స్‌పో

బీచ్‌రోడ్డు: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ విశాఖపట్నం(ఐఐఏ) ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి నోవాటెల్ వేదికగా ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ మెటీరియల్స్(ఏఐ) ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు ఐఐఏ చైర్మన్ రాజేష్ తెలిపారు. ఈ ఎక్స్‌పోలో కేవలం బిల్డింగ్ సామగ్రిని ప్రదర్శించడమే కాకుండా నిర్మాణ రంగంలో వస్తున్న మార్పులు, సాంకేతిక పరిణామాలు, సమస్యలు, పరిష్కారాలపై వృత్తిపరమైన నిపుణులతో అవగాహన కల్పిస్తామన్నారు. శుక్ర, శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్న ఈ ఎక్స్‌పోలో 40 మంది ఎగ్జిబిటర్స్ 60 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆర్కిటెక్ట్ కాలేజీ, విశాఖపట్నం విద్యార్థులు తమ ప్రాజెక్ట్‌లను ఇక్కడ ప్రదర్శిస్తున్నారు.

బాలిక అదృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలం మార్టూరుకు చెందిన బాలిక(16) అదృశ్యమైంది. ఈ మేరకు ఆమె తల్లి అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొవ్వూరు వీఆర్‌ఏ సస్పెన్షన్

కలెక్టర్ నుంచి ఉత్తర్వులు జారీ

రోలుగుంట: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకుగాను మండలంలోని కొవ్వూరు వీఆర్‌ఏ సీరందాసు ప్రభావతిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు కలెక్టరు నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు తహసీల్దారు గురువారం తెలిపారు. బీఎల్వోగా పని చేస్తున్న ఈమె ఇక్కడ 13 మందిని ఫారం-7 ద్వారా చనిపోయినట్టుగా చూపించి తొలగించిందని గ్రామానికి చెందిన పలువురు గతంలో అధికారులకు ఫిర్యాదు చేసిన విదితమే. దీనిపై విచారణ చేపట్టగా, బీఎల్వో ప్రభావతి తానే స్వయంగా సంతకం పెట్టినట్టు అంగీకరించింది. ఈ నివేదికను తహసీల్దార్ కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి నివేదించారు. దాన్ని పరిశీలించి ఆమెను విధుల నుంచి తొలగిస్తూ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని తహసీల్దార్ తెలిపారు. వీఆర్‌ఏ రెండు ఓట్లు కలిగి ఉందని, పరిశీలించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు.

రేపట్నుంచి చిత్రకళా.. మేళా!

- 2 రోజుల పాటు జాతీయ చిత్రకళా పోటీ ప్రదర్శన
- 10 రాష్ట్రాల నుంచి రానున్న సృజనాత్మక చిత్రాలు..
- ఆలోచింపజేసే, ఆకట్టుకోనున్న చిత్రాలు
- చోడవరం ప్రేమసమాజం ఆవరణంలో ఏర్పాట్లు



అందమైన అతివల చిత్రాలు



ఆలోచింపజేసే చిత్రాలు

చోడవరం: కళ్లకు కట్టిపడేసే ఒక్క అందమైన చిత్రం ఎన్నో భావాలను పలికిస్తుంది. అలాంటిది వందలాది అందమై చిత్రాలు ఒకే చోట ప్రదర్శనగా ఉంచితే ... ఆ కళ్లు బాపురే అనిపిస్తాయి. అలాంటి ఎన్నో అందమైన చిత్రాల ప్రదర్శనకు చోడవరం వేదిక కానుంది. ఇక్కడి చిత్రకళా నిలయం ఆధ్వర్యంలో ప్రేమ సమాజం ఆవరణంలో ఈనెల 4వ తేదీ నుంచి రెండు రోజుల పాటు జాతీయ స్థాయి ఆహ్వానపు చిత్ర కళా పోటీలు, ప్రదర్శనకు భారీ ఏర్పాట్లు చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ చిత్రకారులుగా గుర్తింపు పొందిన అనేక మంది గీసిన చిత్రాలు ఈ పోటీలో ప్రదర్శించనున్నారు. ఎన్నో సృజనాత్మక చిత్రాలు, సంఘాన్ని మేల్కొల్పే బొమ్మలు, ఎందరో ప్రముఖ చిత్రకారుల చేతి నుంచి జాలువారిన మరెన్నో అందమైన ఊహాచిత్రాలు అందర్నీ కట్టిపడేసి ఔరా.. అనిపించనున్నాయి. 10 రాష్ట్రాల నుంచి 300 పెద్ద చిత్రాలు పోటీ పడేందుకు సిద్ధమయ్యాయి. వీటితో పాటు ఈ ప్రదర్శనలో జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది చిన్నారులు వేసిన ఎన్నో చిత్రాలు బాలల భావితర ఆలోచనలను ఎత్తిచూపేందుకు సిద్ధమయ్యాయి. నేటి సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, నిర్వీర్యమవుతున్న చెట్లు, ప్రకృతి, రైతన్నల దుస్థితి, బాల్య వివాహాలు, ఆడపిల్లల భద్రత కరువైన సంఘటలను కళ్లకు కట్టినట్టు చూపుతూ పిల్లలు దగ్గర నుంచి పెద్ద చిత్రకారుల వరకు అంతా సామాజిక స్పృహతో గీసిన బొమ్మలు అందర్నీ ఆలోచింపజేయనున్నాయి. పురాణగాథల్లో ఇతవృత్తాంతాలను తెలియజేసే దృశ్యాలతోపాటు గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు, మహిళలు కట్టుబొట్టు విశిష్టతను చాటుతూ కొందరు చిత్రకారులు వేసిన పెయింటింగ్‌లు సైతం ఈ ప్రదర్శనలో ఆకట్టుకోనున్నాయి. జాతీయ స్థాయి చిత్ర కళా ప్రదర్శన చూసేందుకు వేలాది మంది తరలివచ్చే అవకాశం ఉండటంతో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా చోడవరం, పరిసర ప్రాంతాలతోపాటు జిల్లా నలుమూలల నుంచి వివిధ పాఠశాలలు, కాలేజీలకు చెందిన విద్యార్థులు ఈ ప్రదర్శనను చూసేందుకు తరలి రానుండటంతో వారికి ముందస్తుగా సమయాలను కేటాయించారు. ఇంతటి అద్భుతమైన చిత్ర కళా ప్రదర్శన గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



వివిధ రాష్ట్రాల నుంచి చిత్రకారులు వేసిన చిత్రాలు



జాతీయ స్థాయి చిత్రకళా ప్రదర్శనకు ఏర్పాట్లు

పట్టణంలో ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించే జాతీయ స్థాయి చిత్రకళా ప్రదర్శన పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చిత్రకళా నిలయం నిర్వాహకుడు బొడ్డేడ సూర్యనారాయణ తెలిపారు. స్థానిక ప్రేమ సమాజంలో గురువారం ఆయన మాట్లాడారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పశ్చిమబంగా, మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, ఒడిశా, గుజరాత్‌తోపాటు వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో చిత్రాలు ప్రదర్శనకు రానున్నాయన్నారు. విద్యార్థుల నుంచి 1500 చిత్రాలు, ప్రముఖ చిత్రకారుల నుంచి 300 చిత్రాల వరకు ఈ పోటీల్లో ప్రదర్శించనున్నట్టు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు చిత్ర కళానిలయం ఆధ్వర్యంలో చోడవరం ప్రేమ సమాజంలో ఈ జాతీయ స్థాయి చిత్ర కళా ప్రదర్శన పోటీలను ప్రారంభిస్తామన్నారు. ఈ నెల 5వ తేదీన ముగింపు కార్యక్రమంలో ఉత్తమ చిత్రాలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. సమావేశంలో ఫోరం ఫర్ బెటర్ చోడవరం ప్రతినిధులు ఆర్కే ప్రసాద్, ప్రేమ సమాజం మేనేజర్ రాజు, సూర్యారావు, ఆడమ్స్ డైరెక్టర్ బి. వెంకట్రావు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో సత్తా చాటుతాం..



అండర్-17 ఉమ్మడి జిల్లా జట్టు క్రీడాకారిణులు



అండర్-19 జిల్లా జట్టు జట్టు క్రీడాకారిణులు

- యలమంచిలిలో ముగిసిన ఎస్‌జీఎఫ్ బాల్ బ్యాడ్మింటన్ జిల్లా శిక్షణ శిబిరం
- ఆత్మకూరులోని అంతర్ జిల్లాల పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారిణుల పయనం

యలమంచిలి(అనకాపల్లి రూరల్): పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగే ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటుతామని ఉమ్మడి జిల్లా క్రీడాకారిణులు ఆత్మవిశ్వాసాన్ని కనబరిచారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా జట్లకు ఎంపికైన అండర్-14, 17, 19 బాల్ బ్యాడ్మింటన్ బాలికల జట్లకు యలమంచిలి కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండ్రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. పీఈటీలు సిహెచ్ వెంకట్రావు, కేవీ రమేష్‌నాయుడు, ఎం తులసీ సత్యవతి, యలమంచిలి బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు పోలిశెట్టి వీర, టీ యేసుబాబు, జోసెఫ్, రామకృష్ణ మరికొందరు మహిళా పీఈటీలు అవసరమైన మెలకువలు నేర్పించారు. వారి స్థానాల్లో ఎలాంటి నేర్పుతో ఆడితే విజయం సాధించవచ్చో తర్ఫీదునిచ్చారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు ఆత్మకూరులో జరిగే అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కొత్త ఉత్సాహంతో ఆడతామని బాలికలంతా ఆత్మవిశ్వాసాన్ని వెలిబుచ్చారు. ఉమ్మడి జిల్లా అండర్-14, 17, 19 జట్లలో ఎక్కువగా టి. అర్జాపురం, వాడ చీపురుపల్లి గ్రామాలకు చెందిన క్రీడాకారిణులే ఎక్కువగా ఉన్నారు. వీరితోపాటు గోపాలపట్నం, ఏఎస్‌పేట, పాములవాక, గోవాడ, యలమంచిలి, పరవాడ ఉన్నత పాఠశాలలకు చెందిన బాలికలు ఉన్నారు.

శిక్షణతో ఆత్మవిశ్వాసం

ఈ సందర్భంగా శిక్షణ ముగింపు కార్యక్రమంలో కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వైవీ రమణ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ శిబిరాలు విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు పెంపొందేందుకు ఉపయోగపడతాయన్నారు. క్రీడాకారిణుల్లో ప్రతిభను వెలికితీసి వారిని మెరికల్లా తయారు చేసేందుకు శ్రమించిన పీఈటీలను అభినందించారు. చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యమివ్వాలన్నారు. దీనివల్ల మానసిక వికాసం, పోటీతత్వం, శారీరక దృఢత్వానికి దోహదపడతాయని పలువురు ఉపాధ్యాయులు తమ ప్రసంగాల్లో అభిప్రాయపడ్డారు. శిక్షణా శిబిరంలో ప్రతిభ చూపిన ఎం భాగ్యశ్రీ, ఎం భీష్మ నందిని, రాజాన లోకేశ్వరి, మరిసా మౌనిక, వడ్లపూడి వినీల, మాసవరపు శ్యామల, మాసవరపు కల్యాణి, గొంపా జ్యోత్స్న, అండిబోయిన కీర్తనలను అభినందించారు.

మరుపాక విద్యార్థి ప్రతిభ అ'ద్వితీయ'ం

ఉమ్మడి రాష్ట్ర తెలుగు ప్రతిభ పరీక్షలో పురస్కారం



హైదరాబాద్‌లో అవార్డు స్వీకరిస్తున్న విద్యార్థి సత్య స్వరూప్

రావికమతం: మండలంలోని మరుపాక మోడల్ స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి సాసుబిల్లి సత్యస్వరూప్ తెలుగు ప్రతిభ పరీక్షలో ద్వితీయ స్థానం సాధించాడు. ఉమ్మడి రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షలో మన రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. మన సంస్కృతి నెట్‌వర్క్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏటా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల పదో తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్లో తెలుగు ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా గత నెల 10న ఈ పరీక్ష నిర్వహించగా, పలు పాఠశాలల నుంచి ఎంతో మంది విద్యార్థులు రాశారు. ఆ పరీక్షలో చినపాచిల గ్రామానికి చెందిన సాసుబిల్లి మహేష్ కుమారుడు సత్యస్వరూప్ మంచి ప్రతిభ చూపాడు. మన రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఇందుకుగానూ హైదరాబాద్‌లోని ఒక కళాక్షేత్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు, కాకతీయ యూనివర్సిటీ ఆచార్యులు సన్మానించి నగదు బహుమతి అందించారు. ఇంతటి ప్రతిభ చూపిన ఆ విద్యార్థిని పలువురు అభినందించారు.

నాగులాపల్లి సొసైటీని సందర్శించిన లక్నో బృందం



తోటాడలోని గోదామును సందర్శించిన లక్నోలోని పలు సహకార సంఘాల చైర్మన్లు

సంఘ పనితీరుతోపాటు సేవల పట్ల సంతృప్తి

మునగపాక: మండలంలోని నాగులాపల్లి పీఏసీఎస్ పరిధి తోటాడలో రూ.35 లక్షలతో నూతనంగా నిర్మించిన గోదామును లక్నోకు చెందిన ఆలిండియా బ్యాంకర్స్ ఇనిస్టిట్యూట్ బృందం గురువారం సందర్శించింది. రాష్ట్రంలోని పలు సహకార సంఘాల అధ్యయనంలో భాగంగా ఇక్కడకు విచ్చేసి నాగులాపల్లి సహకార బ్యాంకును గోదామును పరిశీలించింది. ఈ సందర్భంగా లక్నో బ్యాంకర్స్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ ఉపేంద్ర సింగ్ మాట్లాడుతూ రైతులు పండించే వ్యవసాయ దినుసులను నిల్వ చేసే విధానం, మార్కెటింగ్ సదుపాయం వంటి సేవలు బాగున్నాయన్నారు. సొసైటీ ద్వారా రైతులకు అందుతున్న సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులు, జీఎల్‌జీ గ్రూపులకు ఇచ్చే రుణాలు, డివిడెండ్ వంటి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. మిజోరాం, ఉత్తరప్రదేశ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్‌లకు సంబంధించిన 40 మంది సహకార సంఘాల చైర్మన్లు ఆయన వెంట ఉన్నారు.

వీరికి అనకాపల్లి జిల్లా బెల్లాన్ని సంఘ పర్సన్ ఇన్‌చార్జి మళ్ల ఉమామహేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర సహకార బ్యాంకు సహాయక జనరల్ మేనేజర్ పీడీసీ రాజు, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ పెంటకోట స్వామి నాయుడు, సహకార బ్యాంక్ అసిస్టెంట్ రిజిస్టర్ డీవీఎస్ రామారావు, సంఘ సీఈవో మళ్ల స్వామి చంద్రనాయుడు, తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తాండవలో ఇసుక తవ్వితే కేసుల నమోదు

ఎస్‌ఈబీ సీఐ రాజారావు



మాట్లాడుతున్న ఎస్‌ఈబీ సీఐ రాజారావు

నాతవరం: తాండవ నదిలో ఇసుక తవ్వకాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఈబీ సీఐ రాజారావు హెచ్చరించారు. మండలంలో తాండవ నదీ పరివాహక ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. అనంతరం నాతవరం పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ రామారావుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి కొత్తగా వచ్చిన ఆదేశాల ప్రకారం తాండవ నదిలో అనధికార ఇసుక తవ్వకాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. అవసరమైతే రాత్రిళ్లు దాడులు నిర్వహిస్తామన్నారు. గతంతో పోల్చుకుంటే సారా తయారీ తగ్గుముఖం పట్టిందన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా గుట్టుగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సారా తయారీ చేసే వారిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అక్రమ మద్యం విక్రయాలు, సారా తయారీ నిర్మూలించేందుకు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలన్నారు. గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎస్‌ఈబీ ఎస్‌ఐ గిరి, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో మరిన్ని అభివృద్ధి పనులు

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



లక్ష్మీపురంలో భూమి పూజ చేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: లక్ష్మీపురంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. సర్పంచ్ శిరుచోళ్ల భవానీ గణపతినాయుడు ఆధ్వర్యంలో ఇక్కడ రూ.40 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులకు గురువారం ధర్మశ్రీ శంకుస్థాపన చేశారు. పెదరామాలయం వద్ద రూ. 5 లక్షలతో చేపడుతున్న కమ్యూనిటీ హాలు భవనం, టాటా ట్రస్ట్ సహకారంతో రూ. 20 లక్షలతో గ్రే వాటర్ మేనేజ్‌మెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులు, సిద్ధిఫల రైతు సంఘం సహకారంతో నాబార్డు నిధులు కలిపి రూ. 15 లక్షలతో కలెక్షన్ సెంటర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్ గణపతినాయుడు చొరవతో ఇప్పటికే గ్రామాభివృద్ధి ఎంతగానో జరిగిందని, మరిన్ని అభివృద్ధి పనుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. చోడవరం నుంచి లక్ష్మీపురం వరకు మరమ్మతులకు గురైన రోడ్డును తారురోడ్డుగా పూర్తి స్థాయిలో నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సంద్ర వీరన్న, ఎస్కే రహమాన్, హైస్కూల్, ఎంపీపీ స్కూల్ చైర్మన్లు భూతనాథుని రామారావు, కొప్పాక వరహాలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు చెల్లపురెడ్డి శ్రీను, సాయిరాం వరలక్ష్మి, మణి, తాటికొండ రాము, ఎస్.వి.ఎస్ శ్రీను, నక్కా వెంకునాయుడ పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్ పని గంటల నిర్ణయం సరైందే

- పారిశ్రామిక వేత్త, అంతర్జాతీయ రచయిత శ్రీధర్ బెవర



సాక్షి, విశాఖపట్నం: పని సంస్కృతి, భారతీయ యువత అంకిత భావాన్ని పెంపొందించేందుకు వారానికి 70 గంటల పని దినాలపై ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి తీసుకున్న నిర్ణయం సరైందేనని ప్రముఖ పారిశ్రామికవేత్త, అంతర్జాతీయ రచయిత శ్రీధర్ బెవర వ్యాఖ్యానించారు. పనిచేస్తున్న సంస్థలో రాణిస్తూ నిపుణులుగా మారడానికి, పోటీతత్వం మెండుగా ఉండేందుకు పనిలో అదనపు సమయం ఎంతో అవసరమని స్పష్టం చేశారు. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి వ్యాఖ్యల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశాన్ని అతి కొద్ది మంది మాత్రమే అర్థం చేసుకోవడం దురదృష్టమన్నారు. ఎంచుకొన్న డొమైన్‌లో అగ్రస్థానంలో లేదా గౌరవప్రదమైన స్థానంలో ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్న వారికి సంస్థలో నైపుణ్యత కలిగిన వారు ఉండాలన్నదే నిజమైన మార్గమని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. దీనికి ఉద్యోగుల నుంచి కూడా సహకారం అందాలన్న ఇన్ఫోసిస్ నిర్ణయాన్ని తాను సమర్థిస్తున్నానన్నారు. ఏదో మొక్కుబడిగా కేవలం రోజుకి ఇన్ని గంటలు లేదా నెలకు ఇన్ని రోజులు మాత్రమే పని చేస్తామని భావించకూడదని శ్రీధర్ బెవర హితవు పలికారు. విశిష్ట రచయిత, మాల్కమ్ గ్లాడ్వెల్ తన పుస్తకం 'అవుట్ లయర్స్'లో చెప్పినట్టుగా, ఒక రంగంలో ప్రపంచం దాసోహం అయ్యే నిపుణులు కావాలంటే కనీసం పదివేల గంటలు నిబద్ధతతో పని చేసి ఉండాలన్న మాటల్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. ఇప్పటికైనా పని గంటల దుమారానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని శ్రీధర్‌బెవర సూచించారు.

ఏయూలో లిక్విడ్‌క్రిస్టల్స్‌పై పరిశోధనలు



రెక్టార్ సమతను సత్కరిస్తున్న సదస్సు నిర్వాహకులు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో నిర్వహిస్తున్న 30వ జాతీయ లిక్విడ్ క్రిస్టల్స్ జాతీయ సదస్సును ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత ప్రారంభించారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు సదస్సు కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏయూ భౌతిక శాస్త్ర విభాగం సర్ సీవీ రామన్‌నుంచి స్ఫూర్తిని పొందిందని, తరువాతి కాలంలో ఆయన శిష్యులు ఆచార్య సూరి భగవంతం బలమైన పునాదులు నిర్మించారన్నారు. నేడు భారత్ అణుశక్తి, అంతరిక్ష, ఐటీ రంగాలలో అద్వితీయ ప్రగతిని సాధిస్తోందన్నారు. ఎల్‌సీడీల ఆవిష్కరణ తదనంతర మార్పులు వివరించారు. మూడు రోజుల సదస్సును పరిశోధకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌ఆర్‌ఐ ఎమిరిటస్ ప్రొఫెసర్ కేపీ సురేష్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా ఏయూలో లిక్విడ్‌క్రిస్టల్స్‌పై పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. ఈ రంగంలో పీసీ పతి చేసిన పరిశోధనలు, కృషిని వివరించారు. ఇండియన్‌లిక్విడ్ క్రిస్టల్ సొసైటీ అధ్యక్షుడు ఆచార్య రవీంద్ర ధర్ మాట్లాడుతూ లిక్విడ్ క్రిస్టల్స్‌పై పరిశోధనలు దేశ వ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్న విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా అందించే పలు అవార్డులను ప్రకటించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాస రావు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం డీన్ ఆచార్య కె.బసవయ్య, సదస్సు కన్వీనర్ ఆచార్య ఎం.రామకృష్ణ నాంచారరావు ప్రసంగించారు. దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన పరిశోధకులు, ఆచార్యులు పాల్గొన్నారు.

నేవీలో ఉద్యోగం పేరిట రూ.5.67 లక్షలకు టోకరా

తగరపువలస: నేవీలో తన కుమార్తెకు ఉద్యోగం ఇప్పిస్తానని జేవీ అగ్రహారం(అప్పికొండవీధి)కి చెందిన ఆదిలక్ష్మి దఫదఫాలుగా తన నుంచి రూ.5,67,000 కాజేసి ఇప్పుడు ముఖం చాటేసిందని తోటవీధికి చెందిన గరుగు సావిత్రి ఆరోపిస్తోంది. బీఎస్సీ చదువుతున్న తన కుమార్తె కల్యాణికి నేవీలో మునీషా బేగం ద్వారా ఉద్యోగం ఇప్పిస్తానని ఈ మొత్తాన్ని కాజేసినట్టు బాధితురాలు తెలిపింది. ఉద్యోగం కోసం మరో రూ.1.60 లక్షలు అడగటంతో మోసపోయినట్టు గుర్తించినట్లు చెప్పింది. దీనిపై గతంలో భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయగా సెప్టెంబర్‌లో రూ.20 వేలు ఇచ్చి మిగిలిన వాయిదాలు చెల్లించలేదన్నారు. విడతల వారీగా డబ్బులు తిరిగి ఇస్తానని ఆదిలక్ష్మి పోలీసుల ముందు అంగీకారపత్రం ఇచ్చి.. ఇప్పుడు ముఖం చాటేస్తోందన్నారు. కుమార్తె ఉద్యోగం కోసం అప్పులు తెచ్చి మోసపోయానని, భీమిలి పోలీసులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తోంది.

పలాస, రాయగడ పాసింజర్ రైళ్ల పునరుద్ధరణ

తాటిచెట్లపాలెం: కంటకాపల్లి-అలమండ మధ్య జరిగిన రైల్వే ప్రమాదం అనంతరం ట్రాక్ పునరుద్ధరణ పనులను రికార్డు సమయంలో పూర్తి చేసిన అధికారులు.. అంతేవేగంగా పలాస, రాయగడ రైళ్లను పునరుద్ధరించారు. ఈ మార్గంలో విద్యార్థులు, చిరు వ్యాపారులు, ఉద్యోగులు నిత్యం ఈ రైళ్లలోనే ప్రయాణిస్తుంటారు. ప్రమాదం కారణంగా ఈ రైళ్లను రద్దు చేశారు. డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ పర్యవేక్షణలో చేపట్టిన చర్యలతో ఈ నెల ఒకటి నుంచి విశాఖపట్నం-రాయగడ, గురువారం నుంచి విశాఖపట్నం-పలాస పాసింజర్ రైళ్లను పునరుద్ధరించినట్లు సీనియర్ డీసీఎం ఎ.కె త్రిపాఠి తెలిపారు.

కొనసాగిన విచారణ

రైలు ప్రమాదంపై డీఆర్‌ఎం కార్యాలయంలో రెండో రోజు కూడా కొనసాగింది. ముందుగా ప్రమాదంలో మరణించిన వారికి నివాళి అర్పిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, ఏడీఆర్‌ఎంలు సుధీర్ కుమార్ గుప్తా(ఇన్‌ఫ్రా), మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), ఇతర అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయించాలని సీఎం జగన్‌కు వినతి



ముఖ్యమంత్రికి వినతిపత్రం అందిస్తున్న సాక్షి బ్యూరో చీఫ్ కె.జి.రాఘవేంద్రారెడ్డి

సీతమ్మధార: విశాఖలో గుర్తింపు పొందిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని విశాఖ అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. గురువారం విశాఖ వచ్చిన సీఎంను సొసైటీ గౌరవ అధ్యక్షుడు, సాక్షి బ్యూరో చీఫ్ కె.జి.రాఘవేంద్రారెడ్డి, అధ్యక్షుడు బి.రవికాంత్, తదితరులు కలిశారు. 18 ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్న జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారు.

క్లుప్తంగా

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం అరుంధతినగర్ యూపీహెచ్‌సీ సచివాలయం పరిధిలో సతకంపట్టు ప్రజలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జోనల్ కమిషనర్ సుర వెంకటరమణ గురువారం ప్రకటనలో తెలిపారు. గతంలో రక్తపరీక్షలు చేయించుకున్నవారికి, టోకెన్లు పొందిన వారితోపాటు, స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు కూడా శిబిరంలో వైద్యసేవలు పొందవచ్చని వారు తెలిపారు. వైద్యశిబిరానికి నలుగురు స్పెషలిస్టు వైద్యులు హాజరై, రోగులను పరీక్షించి, అవసరమైన మందులు ఉచితంగా అందిస్తారని, నేత్ర సమస్యలున్న వారికి ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

26న మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలు



'27వ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్' పోటీల పోస్టర్ ఆవిష్కరణ

తుమ్మపాల: పట్టణంలో గవరపాలెం శ్రీగౌరీ వ్యాయమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26న జరగనున్న ' 27వ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్' పోటీల పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, చీఫ్ అడ్వైజర్ కె.గురునాథరావు, అధ్యక్షుడు కోరిబిల్లి సోమునాయుడు, కార్యదర్శి టి.రాము, పట్టణ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ గురువారం ఆవిష్కరించారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ పోటీల్లో అన్ని జిల్లాల వ్యాయామ క్రీడాకారులు పాల్గొనున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయుడు, కె.కరుణాకర్, ఎ.శ్రీను, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, విల్లూరి రాజేష్ పాల్గొన్నారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: కశింకోటలోని వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. కిలో ఉల్లిపాయలు రూ.60, కిలో టమాటా రూ.40కి విక్రయాలు సాగాయి. బంగాళాదుంప, దొండకాయ రూ.20, వంకాయ రూ.30, బెండకాయ, బీట్రూట్, క్యారెట్, చేమదుంప రూ.40, బరబాటి, బీరకాయ, కాకరకాయ రూ.60, క్యాప్సికం రూ.80, పాదు చిక్కుడు రూ.120కి విక్రయాలు సాగాయి.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 4,112 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,960	4,510
రెండో రకం	3,580	4,070
మూడోరకం	3,100	3,550

అనకాపల్లి సినిమాలు

టైగర్ నాగేశ్వరరావు	: రాజా
లియో	:సత్యనారాయణస్క్రీన్-1
చిన్నా	:సత్యనారాయణస్క్రీన్-2
భగవంత్ కేసరి	: షిర్డిసాయి
టైగర్ నాగేశ్వరరావు	: పర్తిసాయి
గణపథ్(తెలుగు)	: వెంకటేశ్వర
ఓటు చాలా విలువైనది (ఉ॥ మ॥)	
ధీమహి (ఫస్ట్ షో, సెకండ్ షో)	: శ్రీసత్య
భగవంత్ కేసరి	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 56 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-6 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-28 యూనిట్లు, ఏబీ పాజిటివ్-8 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 413 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

జోరుగా బొజ్జన్న కొండ అభివృద్ధి పనులు

- రూ.7.32 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు
- ఆరుమాసాల్లో పూర్తి చేసేలా చర్యలు
- పెరగనున్న పర్యాటకం



బొజ్జన్న కొండ వద్ద పర్యాటకులకు రెస్టారెంట్ నిర్మాణ పనులు

అనకాపల్లిటౌన్ : బొజ్జన్న కొండకు మహర్దశ రానున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల టూరిజంశాఖ అధికారులు కొండను అభివృద్ధి చేసేందుకు రూ.7 కోట్ల 32లక్షల 49వేలు నిధులు విడుదల చేసి అభివృద్ధి పనులు ప్రారంభించారు. సుమారుగా ఆరు మాసాల్లో పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి చొరవతో ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు, అవసరమైన మౌలిక సదుపాయలు కల్పించేందుకు కృషి చేస్తున్నారు.

రెస్టారెంట్ నిర్మాణ పనులు

కొండ సమీపంలో టూరిజంశాఖ అధికారులు రైతుల నుంచి ఎకరా 40 సెంట్లు స్థలాన్ని కొనుగోలు చేసి, రూ.కోటి 82 లక్షల నిధులతో రెస్టారెంట్‌ను ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభించారు. ఆటో విజివల్ రూమ్, కిచెన్ రూమ్, పర్యాటకులు కూర్చునేందుకు హాలు, మరుగుదొడ్లు, స్టోర్ రూమ్ వంటి సదుపాయాలతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

ఇవీ సదుపాయాలు

- రూ.37.44 లక్షలతో పార్కింగ్ సదుపాయం
- బొజ్జన్న, లింగాలకొండ పైభాగంలో రూ.28 లక్షలతో లైటింగ్ ఏర్పాటు
- రూ.7.34 లక్షలతో అనకాపల్లి నుంచి సబ్బవరం వెళ్లే జాతీయ రహదారి శంకరం పంచాయతీ పరిధిలో బొజ్జన్న కొండకు వచ్చే రహదారిలో బుద్దిస్టు తోరణ(ఆర్చ్) నిర్మాణం.
- రూ.4.72 కోట్లతో కొండ పరిసర ప్రాంతాల్లో లైటింగ్, సౌండ్స్ సదుపాయాలు
- రూ.2.32 లక్షలతో సీసీటీవీలు, రూ.2.50 లక్షలతో వైఫై సౌకర్యం

ఆరు నెలల్లో అందుబాటులో సౌకర్యాలు



పర్యాటకంగా బొజ్జన్నకొండకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. కొండ వద్ద సరైన మౌలిక సదుపాయలు లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందువల్ల ఇక్కడ సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వాలు రూ.7.32 కోట్లు మంజూరు చేసింది. వెంటనే పనులు ప్రారంభించాం. ఆరు నెలల్లో పూర్తి చేస్తాం.

-కె.రమణ, టూరిజంశాఖ ఈఈ

వైభవంగా మరిడిమాంబ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్



అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

అనకాపల్లి రూరల్: రెండు గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం మరిడిమాంబ అమ్మవారి జాతర గురువారం మండలంలోని కొత్తూరు, పిసినికాడ గ్రామాల్లో అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పిండి వంటలతో అమ్మవారికి నైవేద్యం పెట్టారు. సాయంత్రం గ్రామాల్లో పలుచోట్ల ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బాజాభజంత్రీలు,డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేయడానికి గ్రామస్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. అమ్మవారికి పసుపు కుంకుమలు,చీరలు, గాజులు, నల్లపూసలు సమర్పించారు. విద్యుద్దీపాలంకరణతో జాతరలో సంది నెలకొంది. ఈ సందర్భంగా బాణా సంచా వెలిగించారు. సర్పంచ్ యల్లపు రమేష్, మళ్ల పూర్ణ సూరి గణేష్, మళ్ల వెంకట్రావు తదితరులు జాతరలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. జాతర సందర్భంగా వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనను ఆలయ కమిటీల అధ్యక్షులు సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మేడిశెట్టి సత్తిబాబు, బొడ్డపాటి చినరాజారావు, దాడి రాము, శిలపరశెట్టి బాబి, ఇంటి త్రినాథ్, కోటిపల్లి శ్రీను, రమణబాబు, నంబారి రమణ, నందవరపు కుమార్, బోయిన రమణ, శ్రీను పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి అండగా సురక్ష శిబిరాలు



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ సూరిబాబు

తుమ్మపాల: ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. పట్టణంలో 80వ వార్డు బంగ్లా వద్ద పీహెచ్‌సీలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులకు సైతం వైద్యం అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వీలుకాని సేవలను ప్రైవేటు ఆసుపత్రుల ద్వారా అందించి రోగాలను నయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేట్ కొణతాల నీలిమాభాస్కర్, పార్టీ నాయకులు కోరిబిల్లి అరుద్ర, శిలపరశెట్టి బాబీ, కర్రి అప్పాజీ పాల్గొన్నారు.

బృహత్తర కార్యక్రమం...

అనారోగ్యం గల ప్రతి పేదవాడికి ప్రత్యేక వైద్యులతో వైద్య సేవలందించే బృహత్తర కార్యక్రమం జగనన్న సురక్ష పథకమని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రుల్లో అందించే వైద్య సేవలను నేరుగా పల్లెల్లోనే ప్రత్యేక శిబిరాల ద్వారా నిర్వహించి ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న ప్రజలకు అందిస్తున్నామన్నారు. ఎంపీడీవో నరసింహరావు, ఈవోపీఆర్డీ ధర్మారావు, సర్పంచ్ శాలాపు శాంతి సూరిఅప్పారావు, పీఏసీఎస్ డైరెక్టర్ నారపిన్ని ప్రసాద్, సచివాలయ కన్వీనర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్వోఎఫ్ఆర్ కోసం 5 లోగా దరఖాస్తులు

మాడుగుల రూరల్: మండలంలో ఆర్వోఎఫ్ఆర్ పట్టాల కోసం ఈ నెల 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు పి.వి.రత్నం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా పొందలేని ఆర్వోఎఫ్ఆర్ పట్టాదారులు ఆర్వోఎఫ్ఆర్ పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా పాసుపుస్తకం, ఆధార్ నకళ్లు తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఈ సమాచారాన్ని పాడేరు ఐటీడీఏకు పంపిస్తామన్నారు. గతంలో ఆర్వోఎఫ్ఆర్ పట్టాదారుడు మృతి చెందితే, వారి వారసులకు గిరిమిత్ర వెబ్‌సైట్‌లో వివరాలు పరిశీలించి మ్యూటేషన్ చేస్తామన్నారు. దీని కోసం ఆర్వోఎఫ్ఆర్ పట్టా, డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, వారసుల ఆధార్ బ్యాంకు పాసుపుస్తకం జెరాక్స్ కాపీలు సమర్పించాలన్నారు.

9న ఎన్టీఆర్ క్రీడా మైదానానికి సామాజిక బస్సు యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న దిలీప్‌కుమార్

అనకాపల్లి టౌన్ : సామాజిక సాధికార బస్సుయాత్ర ఈనెల 9వ తేదీన స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానానికి మధ్యాహ్నం 3 గంటలకు చేరుకుంటుందని, అక్కడే నియోజకవర్గ స్థాయి భారీ బహిరంగ సభ జరుగుతుందని రాష్ట్ర ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్ రోడ్డు మంత్రి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద ఆధ్వర్యంలో మండల నాయకులు, కార్యకర్తలతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలకు కోసం ప్రభుత్వం చేపడుతున్న సామాజిక సాధికార బస్సుయాత్రకు అనకాపల్లి మండలం నుంచి సుమారుగా 12వేల మంది ప్రజలు స్వచ్ఛందంగా భారీ బహిరంగ సభలో పాల్గొంటారని అన్నారు. ఎంపీపీ సూరిబాబు మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల ప్రజలకు రూ.2 లక్షల కోట్ల 35 వేలు డీబీటీ పద్ధతి ద్వారా అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గాంధీజీ కలలు కన్నగ్రామ స్వరాజ్యం వైఎస్సార్‌సీపీ పాలనలో సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి పద్మ, పార్టీ నేతలు సేనాపతి శ్రీను, చంద్రశేఖర్, అప్పలరాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బస్సు యాత్ర విజయవంతం చేయాలి



తాళ్లపాలెంలో మాట్లాడుతున్న పార్టీ సచివాలయ కన్వీనర్ గున్నయ్యనాయుడు

కశింకోట: నియోజక వర్గం సామాజిక సాధికార బస్సు యాత్ర ఈ నెల 9న అనకాపల్లిలో జరగనుందని, ఈ యాత్రకు మండలం నుంచి భారీ సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు కోరారు. తాళ్లపాలెం కల్యాణ మండపంలో గురువారం వైఎస్సార్‌సీపీ మండల కార్యవర్గం, పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సాధికార బస్సు యాత్రకు మండలం నుంచి పదివేల మంది పైబడి తరలి వెళ్లాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు సాధికార బస్సుకు తరలి వెళ్లడానికి సన్నద్ధం కావాలన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, వైస్ ఎంపీపీలు మీనా, జ్యోతి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు సోమునాయుడు, ఎంపీటీసీ సభ్యుడు సతీష్, మాజీ సర్పంచ్ వల్లభనారాయణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

84 శాతం మందికి పింఛన్ల పంపిణీ

కశింకోట : మండలంలో 84.81 శాతం మేర ఈ నెల పింఛన్ల సొమ్ము లబ్ధిదారులకు గ్రామ వలంటీర్ల ద్వారా పంపిణీ చేసినట్టు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. మండలంలో 10569 వృద్ధాప్య, వితంతు, వికలాంగ, ఇతర పింఛన్‌దారులున్నారన్నారు. వీరిలో 8964 మందికి పింఛన్ల సొమ్ము అందజేశామన్నారు. ఇంకా 1605 మందికి పింఛన్ సొమ్ము పంపిణీ చేయాల్సి ఉందన్నారు. లబ్ధిదారులు ఇంటి వద్ద లేకపోవడం, తదితర కారణాల వల్ల వీరికి పంపిణీ కాలేదని, వారికి కూడా సత్వరమే పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు వినతి



ఆలయం వద్ద నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు వినతిపత్రం అందిస్తున్న దాడి రత్నాకర్

తుమ్మపాల : గవరపాలెం శ్రీజగన్నాథస్వామి ఆలయం ప్రాంతంలో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసి లోఓల్టేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ విద్యుత్ శాఖ అధికారులను కోరారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో గురువారం డీఈని కలిసి విద్యుత్ లోఓల్టేజీ సమస్యలను తెలియజేసి వినతిపత్రం అందించారు. 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోనే ఇప్పటికి విద్యుత్ అందించడంతో లోవోల్టేజీ సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. జనాభా పెరిగిందని, తద్వారా విద్యుత్ సరఫరా పెంచాలన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దాడి ఈశ్వరరావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబీ, పార్టీ నాయకులు మళ్ల రామచంద్రరావు, పి.ఎం.ఎస్.కె.నాయుడు, కొణతాల వరదే వినాయుడు, బొడ్డపాటి చినరాజారావు పాల్గొన్నారు.

రిటైర్డ్ సహకార ఉద్యోగులకు న్యాయం చేయాలి



ప్రాథమిక సహకార సంఘం విశ్రాంత ఉద్యోగులు

తుమ్మపాల : ప్రాథమిక సహకార సంఘాల్లో 1999వ ఏడాదిలో ఆఫ ఏ మిలియన్ జాబ్ కార్యదర్శులుగా చేరి సుదీర్ఘ కాలం సేవలందించిన రిటైర్డ్ ఉద్యోగులకు నష్టం కలిగించే విధంగా బెనిఫిట్స్ అందించడం అన్యాయమని కేంద్ర సహకార బ్యాంకు విశ్రాంతి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు విల్లూరి పైడారావు, సూరిశెట్టి రమణ, ఐ.అప్పలరాజు అన్నారు. పట్టణంలో జార్జి క్లబ్ ఆవరణలో కేంద్ర సహకార బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం.వి.రమణ ఆధ్వర్యంలో జరిగిన జమావేశంలో వారు మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగుల సర్వీసుకు 22 మాసాల లీవ్ శాలరీ గ్రాట్యుటీ అమలు చేయవలసి ఉండగా బ్యాంకు సర్వీసుకు మాత్రమే రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తూ అన్యాయం చేయడం తగదన్నారు. దీనిపై హైకోర్టు ఉత్తర్వులను అమలు చేసేలా పాలకవర్గం, సీఈవోను కలిసి వినతిపత్రాలు అందించాలని సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు ఎస్.నాగేశ్వరారావు, కాశీపతి, చిన్నయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ



నైపుణ్య అభివృద్ధి శిక్షణ ఒప్పందం చేసుకుంటున్న డైట్ కళాశాల

తుమ్మపాల: భారత ప్రభుత్వ సంస్థ (మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) సంస్థతో విద్యార్థులకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ కోసం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు తెలిపారు. గురువారం డైట్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఒప్పందంపై సీఎస్‌సీ అకాడమీ ప్రతినిధులు సంతకాలు చేశారన్నారు. ఈ ఒప్పందం ద్వారా యుజీ, పీజీ చేస్తున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులతో పాటు అన్ని వర్గాల విద్యార్థులకు నైపుణ్య శిక్షణపై అవగాహన జరుగుతుందన్నారు. చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ అలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, తమ డిగ్రీతో పాటు అదనపు సాంకేతిక పరిజ్ఞానం చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌సీ అకాడమీ ప్రతినిధులు రామ్మోహన్‌రావు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

అన్న ప్రసాదం కోసం 20 గ్యాస్ స్టౌల కొనుగోలు



ఆలయం కాటేజీలో నూతన గ్యాస్ స్టౌలను ప్రారంభిస్తున్న కొణతాల మురళీకృష్ణ

తుమ్మపాల: నూకాంబిక అమ్మవారి కాటేజీలో అమ్మవారి ఉపారం, అన్నప్రసాదం వండేందుకు వీలుగా 20 గ్యాస్ స్టౌలను కొనుగోలు చేసి వాటిపై ప్రసాదం వండినట్లు ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. ఆలయం కాటేజీలో వాటిని అమర్చి గురువారం పూజలు చేశామన్నారు. ఒక్కో స్టౌకు రూ.2750 ఖర్చు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు బుద్ధ నర్సింగరాజు కొండూరు వీరేంద్రనాద్, గొల్లవిల్లి నర్సింగరావు, ఎం.శ్రీనివాసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ



కశింకోటలోని జాషువా కాలనీలో ఎమ్మార్పీఎస్ చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ

కశింకోట : మాదిగల విశ్వరూప మహాసభ ఈ నెల 11న హైదరాబాద్‌లో జరగనుందని, మాదిగలు అధికంగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని మహాజన్ సోషలిస్టు పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టుమూరి మంగరాజు కోరారు. స్థానిక జాషువా కాలనీలో మాదిగ రిజరేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీస్) కార్యకర్తల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదిగల విశ్వరూప మహాసభకు ప్రధాని నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారన్నారు. మందకృష్ణ మాదిగ మూడు దశాబ్దాలుగా మాదిగ రిజర్వేషన్ కోసం జరుపుతున్న సుదీర్ఘ పోరాటానికి అంతిమ విజయానికి ఈ సభ వేదిక కాగలదన్నారు. సభకు జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి మాదిగలు బయలుదేరాలని కోరారు. ఈ సందర్భంగా చలో హైదరాబాద్ పేరుతో రూపొందించిన వాల్ పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ కొల్లి చిన్న అప్పారావు, జిల్లా యువసేన అధ్యక్షుడు యలక మల్లిబాబు, ప్రతినిధులు చెవ్వేటి నాగరాజు, నరసింగరావు, చంటి, దేముడు, అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా సాంబశివుని రాట మహోత్సవం



మునగపాకలో సాంబశివుని రాట మహోత్సవంలో భక్తులు

మునగపాక : గ్రామంలో సాంబశివుని రాట మహోత్సవం గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేపచెట్టుకు కుంకుమ, పసుపు అద్ది ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 27న సాంబశివుని శూలాల మహోత్సవంలో భాగంగా ముందస్తుగా రాట మహోత్సవం గ్రామస్తుల సహకారంతో ఘనంగా జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, పెద్దలు దాడి శ్రీరామమూర్తి, వేగి కృష్ణ, పెంటకోట జగ్గప్పారావు, ఆడారి కాశీబాబు, బొడ్డేడ మహేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సలహాలు పాటిస్తే మేలైన దిగుబడులు



రైతులకు అవగాహన కలిస్తున్న ఏవో సుమంత

రాంబిల్లి : శాస్త్రీయ సలహాలు పాటిస్తే మేలైన దిగుబడులు సాధించవచ్చునని ఏవో సి.సుమంత అన్నారు. కుమ్మరాపల్లి గ్రామంలో గురువారం వరి పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వరి యాజమాన్య పద్ధతులను వివరించారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు మేరకే ఎరువులు, క్రిమిసంహారక మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. యూరియాను అవసరం మేరకే వినియోగించాలన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు గొల్లవిల్లి శ్రీనువాసరావు, చొప్పపట్ల ప్రకాశరావు, జనపరెడ్డి చిన్న పాల్గొన్నారు.

18న హిందూ సాంస్కృతిక సమ్మేళనం



సమావేశమైన సమరసతా సేవా ఫాండేషన్ సభ్యులు

అచ్యుతాపురం(అనకాపల్లి): ఈ నెల 18న హిందూ సాంస్కృతిక సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు సమరసతా సేవా ఫాండేషన్ జిల్లా కో-కన్వీనర్ పోతు రంగారావు అన్నారు.అచ్యుతాపురం మండల కేంద్రంలో శ్రీకృష్ణ, ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో గురువారం సమరసతా సేవా ఫాండేషన్ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మంలో కళలను ప్రదర్శించే అన్ని గ్రామాల ప్రజలను మండల కేంద్రంలో ఒక చోటకి చేర్చి కళలను ప్రదర్శించడంతో పాటు, సత్కరించనున్నట్టు ఆయన తెలిపారు. కార్తీక పౌర్ణమి రోజున దీపాలంకరణ, సామూహిక హారతి చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొల్లి అప్పారావు, గుడివాడ రమణ, రెడ్డి అప్పలనాయుడు, చోడిపల్లి సత్యం, కూండ్రపు రమణ, మేరుగు రాజారావు, నాని పాల్గొన్నారు.

చలో విజయవాడ విజయవంతం చేయాలి

యలమంచిలి : ప్రజా రక్షణ భేరి సభను రిక్షా కార్మికులు విజయవంతం చేయాలని సీపీఎం నాయకుడు కర్రి అప్పారావు పిలుపునిచ్చారు. గురువారం యలమంచిలి పట్టణంలో రిక్షా కార్మికులతో కలసి చలో విజయవాడ ప్రజా రక్షణ భేరి సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నవంబర్ 15వ తేదీన విజయవాడలో జరిగే భారీ బహిరంగ సభకు అసంఘటిత కార్మికులు, రిక్షా కార్మికులు, మున్సిపల్ వర్కర్స్, చిరు వ్యాపారులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు



గుమ్మడి అమ్మలు పేరంటాలు ఆలయం

రాంబిల్లి : కొత్తూరులో గుమ్మడి అమ్మలు పేరంటాలు ఆలయం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. సుందరపు విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులు తమ ఇలవేల్పు కావడంతో సొంత నిధులతో ఆలయాన్ని నిర్మించారు. అమ్మవారి కొత్త విగ్రహాన్ని ఈ నెల 4న ప్రతిష్ఠ చేయనున్నారు. ఇందులో భాగంగా గురువారం హోమం, ఇతర పూజలు నిర్వహించారు. శనివారం ఆలయం ప్రారంభం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ సుందరపు విజయ్‌కుమార్ తెలిపారు.